పనులు త్వరగా పూర్తి చేయాలి

రాయికల్, జనవరి 20 : రాయికల్ మున్సిపల్ పరిధిలో జరిగే అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఇందులో పట్టణంలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో నిర్మాణంలో ఉన్న సీసీ డ్రెయిన్లు, రోడ్ల పనులు, పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాలు, నీటి సరఫరాపై సమీక్షించారు. పలువురు కౌన్సిల్ సభ్యులు తాగు నీటి సమస్యలను దృష్టికి తీసుకురాగా అమృత్ 2.0 ప్రాజెక్టు పనులు ప్రారంభం కానున్నాయని, ఇందుకు సంబంధించిన స్థలం కొనుగోలు చేసి పనులు తొందరగా పూర్తయ్యేలా చూస్తామని కమిషనర్ తెలిపారు. వార్డుల్లో అవసరమైన విద్యుత్ స్తంభాల ఏర్పాటు, ఇతర 22 అంశాలను ఏకగ్రీవంగా తీర్మానించినారు.

నటరాజుకు జాతీయ ఐకాన్ అవార్డు

అవార్డు తీసుకుంటున్న నటరాజ్

రాయికల్, జనవరి 20 : మండలంలోని అల్లీపూర్‌కు చెందిన డాక్టర్ బోధనపు నటరాజుకు అభిలాష హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజే షన్ ఐదో వార్షిక మహోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సోమవారం సుభాష్ చంద్రబోస్ జాతీయ ఐకాన్ అవార్డును మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రదానం చేశారు. 24 ఏళ్లుగా సామాజిక, ఉద్యమ, జానపదగేయ కళాకారుడిగా రాణిస్తున్న నటరాజుకు ఈ అవార్డును అందించినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సరోజనమ్మ తెలిపారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల రూరల్, జనవరి 20 : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల డిమాండ్ చేశారు. సోమవారం కోరుట్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు రుణమాఫీ, రైతు పెట్టుబడి ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. 14నెలల పాలనలో ఒక్క కొత్తపెన్షన్ ఇవ్వలేదన్నారు. దేశంలోనే మొదటిసారిగా రాష్ట్రంలో బీడీ కార్మికులకు బీడీ పెన్షన్ ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లో కేసీఆర్ ముందుకు తీసుకెళ్లారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, ఉపాధ్యక్షుడు గట్ల అనంత స్వామి, బీఆర్ఎస్ పట్టణ మైనార్టీ అధ్యక్షుడు ఎండీ ఫహీం, రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకట్రావ్, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కాశీరెడ్డి మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు నత్తి రాజ్‌కుమార్, ఎంఐఎం అధ్యక్షుడు ఎండీ రఫీ, సహకార సంఘాల అధ్యక్షుడు సింగిరెడ్డి నర్సారెడ్డి, బండి భూమయ్య ఉన్నారు.

కోరుట్ల ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో కల్యాణలక్ష్మి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే

ఏడాదిలో తెలంగాణ తిరోగమనం

మెట్‌పల్లి రూరల్, జనవరి 20 : కాంగ్రెస్ ఏడాది పాలనలో తెలంగాణ అభివృద్ధి తిరోగమనంవైపు పయనిస్తున్నదని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ విమర్శించారు. తెలంగాణ రాక ముందు పరిస్థితి, రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనించాలని కోరారు.మెట్‌పల్లి మండల పరిషత్ ఆఫీస్‌లో 12మందికి కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ₹1,00,116 చొప్పున మంజూరైన ₹12,01,392 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్, ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐలు ఉమేశ్, కాంతయ్య, మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పీసు తిరుపతి, డాకూరి వెంకటేశ్, ఆరెళ్ల రాజాగౌడ్, ఒజ్జెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

మల్లాపూర్, జనవరి 20: ఇటీవల పలువురు వేర్వేరు కారణాలతో మృతి చెందిగా, సోమవారం బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. అలాగే నిరుపేద కుటుంబాలకు తన వంతుగా ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ కదుర్క నర్సయ్య, తదితరులు ఉన్నారు.

కోరుట్ల రూరల్: బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి గుడ్ల మనోహర్ తల్లి గుడ్ల అన్నపూర్ణ, పట్టణ ఆర్య వైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు అల్లాడి ప్రవీణ్ తండ్రి అల్లాడి రామేశం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా, సోమవారం స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, తదితరులు ఉన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌గా విజయభాస్కర్

మెట్‌పల్లి, జనవరి20: మెట్‌పల్లి ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా విజయభాస్కర్ నియమితులయ్యారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న ఆయనను మెట్‌పల్లికి బదిలీచేశారు. సబ్‌రిజిస్ట్రార్ అసిఫొద్దీన్ ఏసీబీ చిక్కి సస్పెండ్ కాగా, ఆయన స్థానంలో తాత్కాలికంగా జూనియర్ అసిస్టెంట్ బాల్‌సింగ్‌కు ఈ నెల 16 నుంచి ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా బాధ్యతలు అప్పగించారు. కొత్తగా ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా నియమితులైన విజయభాస్కర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మంళవారం నుంచి ఆయన రిజిస్ట్రేషన్ల ప్రక్రియను నిర్వహించనున్నారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

మెట్‌పల్లి, జనవరి20: మండలంలోని విట్టంపేటకు చెందిన డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని (17) అదృశ్యమైంది. ఎస్ఐ కిరణ్‌కుమార్ వివరాల ప్రకారం.. మెట్‌పల్లి పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని ఈ నెల 15న మధ్యాహ్నం 3 గంటల సమయంలో విట్టంపేటలోని ఇంటిలో నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో విద్యార్థిని తల్లి కరేంగుల లహరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సోమవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆరుగురిపై కేసు

మెట్‌పల్లి,జనవరి 20: వాట్సాప్ గ్రూప్ సభ్యుడి ఫిర్యాదుతో మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఎల్లాపి సంఘం వాట్సాప్ గ్రూప్‌లో శ్రీధర్‌రావు మరికొందరు స్నేహితులతో కలిసి గత నెల 26న జన్మదిన వేడుకల్లో భాగంగా తల్వార్ పట్టుకొని దిగిన ఫొటోను పోస్టు చేశారు. అదే విధంగా జనవాసాల నడుమ తల్వార్ పట్టుకుని న్యూసెన్స్ చేశారు. ఈ వాట్సాప్ గ్రూప్‌లో సభ్యుడిగా ఉన్న గంట ఉపేందర్‌రావు ఫిర్యాదు మేరకు ఫొటోలో ఉన్న శ్రీధర్‌రావు, వెంకటేశ్, కిశోర్‌రావు, రాజేశ్, బోధన్‌కారి మణి, కోరుట్ల రాజుపై కేసు నమోదు చేశారు.

విద్యార్థుల భద్రతపై చర్యలు తీసుకోవాలి : ఎస్పీ

మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 21 : విద్యార్థుల భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని స్కూల్ వాహనాల ఫిట్‌నెస్, స్కూల్ వాహనాల యజమానులు, డ్రైవర్లకు రోడ్డు సేఫ్టీపై జిల్లా కేంద్రంలోని దరూర్ రామాలయం వద్ద గల మైదానంలో ఎస్పీ సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్కూల్ బస్సుల్లో పిల్లలను తీసుకెళ్లే సమయాల్లో అత్యంత జాగ్రత్తగా వాహనాలు నడుపాలన్నారు. అనంతరం స్కూల్ వ్యాన్లను పరిశీలించారు. డీఎస్పీలు రఘుచందర్, డీటీవో శ్రీనివాస్, ఆర్ఐ వేణు, ఎస్సైలు సదాకర్, మల్లేశం, గీత, రవాణా శాఖ అధికారులు స్కూల్ వ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

ఏటీఎంల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలి

జిల్లాలోని ప్రతి బ్యాంకు, ఏటీం వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలని బ్యాంకు అధికారులకు ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. బ్యాంకులు, ఏటీఎంల వద్ద తీసుకోవాల్సిన భద్రతపరమైన చర్యలపై బ్యాంకర్లు, బ్యాంకు అధికారులతో జిల్లా కేంద్రంలోని పోలీస్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో ఎస్పీ సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బ్యాంకు, ఏటీఎంల వద్ద సెక్యూరిటీ గార్డు, సీసీ కెమెరా, అలారం సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. డీఎస్పీ రఘుచందర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆరీఫ్ అలీఖాన్, వ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్ డే

ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకే ప్రతి సోమవారం గ్రీవెన్స్‌డేను నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో గ్రీవెన్స్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ వారి సమస్యను తెలుసుకొన్నారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులతో నేరుగా ఫోన్లతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యలు పరిష్కరించాలంటూ 13 మంది అర్జీదారులు తమ అర్జీలను ఎస్పీకి అందజేశారు.

బెడ్ పైనుంచి కింద పడ్డ రోగి!

- సచ్చిపోతున్నా పట్టించుకోండంటూ వేడుకోలు
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్య సిబ్బంది
- జగిత్యాల ఏరియా దవాఖానలో వెలుగులోకి ఘటన

కింద పడి ఉన్న రోగి భూమయ్య

జగిత్యాల, జనవరి 20 : చికిత్స కోసం వచ్చిన వృద్ధుడు బెడ్ పై నుంచి కింద పడి రోదిస్తున్నా వైద్య సిబ్బంది కనీసం అటువైపు కన్నెత్తి చూడలేదు. సచ్చిపోతున్నా పట్టించుకోండంటూ రోదిస్తున్నా కనికరించలేదు. జగిత్యాల ప్రభుత్వ ఏరియా దవాఖానలో ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం మల్లన్నపేట గ్రామానికి చెందిన వృద్ధుడు బళ్ళారి భూమయ్యగౌడ్‌కు భార్య, పిల్లలు లేరు. ఇటీవల అతడు అనారోగ్యం పాలు కాగా, తన ఇంటి వద్ద స్థానికులు జిల్లాకేంద్రంలోని ఏరియా దవాఖానలో వైద్యం కోసం చేర్పించారు. కాగా, ఆదివారం రాత్రి భూమయ్య గౌడ్ బెడ్ మీద నుంచి కింద పడిపోయాడు. దీంతో అతడు ''కిందపడ్డా.. సచ్చిపోతున్నా..'' అని గంటసేపు రోదించాడు. అయినా, దవాఖాన సిబ్బంది మాత్రం పట్టించుకోలేదు. అక్కడ ఉన్న వారు గమనించి మీడియా మిత్రులకు సమాచారం అందించడంతో పాటు వైద్య సిబ్బందికి విషయం చెప్పారు. వారు వచ్చి అతడిని బెడ్‌పై పడుకోబెట్టి వైద్యం అందించారు. ఈ విషయమై దవాఖాన ఇన్‌చార్జి సూపరింటెండెంట్ సుమన్‌రావు వివరణ కోరగా, భూమయ్య మానసిక పరిస్థితి సరిగా లేదని, రోగి వెంట బంధువులు ఎవరూ లేరని, బెడ్‌పై పడుకోబెట్టినా కావాలని కింద పడుకుంటున్నాడని వివరణ ఇచ్చారు. అతడిని సైక్రియాట్రిక్ ట్రీట్‌మెంట్‌కు రిఫర్ చేసినట్లు తెలిపారు. ఏదేమైనా జగిత్యాల దవాఖాన ఇటీవల వివాదాలకు కేరాఫ్‌గా మారింది. ఇప్పటికే క్రిస్మస్ వేడుకలకు నర్సింగ్ సిబ్బంది ఓ గదిలో డ్యాన్స్ రిహార్సల్ చేయడం.. ఇటీవల చికిత్స కోసం వచ్చిన వృద్ధ జంటను బయట పడుకోబెట్టడం.. ఇప్పుడు ఈ ఘటన జరగడంతో దవాఖాన సిబ్బందిపై విమర్శలు తలెత్తుతున్నాయి.

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

జగిత్యాల, జనవరి 20 : గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై లత సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహించనున్నందున అందుకనుగుణంగా వేదిక, సీటింగ్ ఏర్పాట్లను పక్కాగా చేయాలన్నారు. అడిషనల్ ఎస్పీ భీమ్‌రాం, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డీఆర్డీవో రఘువరణ్, కలెక్టరేట్ ఏవో హన్మంత రావు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏకగ్రీవం

మేడిపల్లి, జనవరి 20 : భీమారం మండల కేంద్రంలో సోమవారం చైతన్యకాపు సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బద్దం రాఘవరెడ్డి, ఉపాధ్యక్షులుగా పుప్పాల బుచ్చిరెడ్డి, కోశాధికారిగా చెక్కపెల్లి మురళి, సలహాదారులుగా కనుక ఊశన్న, చెక్కపెల్లి శ్రీనివాస్, రైటర్‌గా లైశెట్టి సురేశ్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ఎంఈవోకు వినతి

మేడిపల్లి, జనవరి 20 : మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు తమ సమస్యలను పరిష్కరించాలని సోమవారం మేడిపల్లి మండల కేంద్రంలో ఎంఈవో లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడిగుడ్ల ధరలు పెరిగాయని, ప్రభుత్వమే కోడిగుడ్లను సరఫరా చేయాలన్నారు. ప్రతి విద్యార్థికి మెనూ చార్జీలు రూ.25 చెల్లించాలన్నారు. పాత బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. మొనుగూరి హన్మంతు, రాజయ్య, లక్ష్మి, అంకూస్, గంగమ్మ, జగన్, లావణ్య, గంగు పాల్గొన్నారు.

'వేతనాలు చెల్లించాలి'

కొడిమ్యాల, జనవరి 20 : పంచాయతీ కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలని పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా పంచాయతీ అధికారి డీపీవోకు సంఘ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికుల వేతనాలు వేంటనే చెల్లించాలని కార్మికులకు ఇన్సురెన్స్ కల్పించాలని, 2 జతల యూనిపామ్స్, సబ్బులు, నూనేలు అందించాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ యూనీయన్ వర్కర్స్ అధ్యక్షులు కోమటి చంద్రశేఖర్, పులిమల్లేశం, సత్తయ్య, రాజేశం, తదితరులున్నారు.

బాధిత కుటుంబాలకు పదో తరగతి మిత్రుల ఔదార్యం

పెగడపల్లి, జనవరి 20 : మండలంలోని నంచర్ల గ్రామానికి చెందిన 2005-06కు చెందిన పదో తరగతి మిత్రులు తమ ఔదార్యం చాటుకున్నారు. గ్రామానికి చెందిన ముగ్గురు బాధిత కుటుంబాలకు రూ.68 వేల నగదు సాయాన్ని అందజేశారు. ఇదే గ్రామానికి చెందిన తమ మిత్రురాలు తునికిపట్ల శ్వేత ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబానికి రూ. 21500, అలాగే మరో మిత్రుడు బుర్ర ప్రవీణ్ అమ్మ మృతి చెందగా, ఆ కుటుంబానికి రూ. 25 వేలు, అలాగే ఇంకో మిత్రుడు తీగల వేణు గోపాల్‌గౌడ్ నాన్న మృతి చెందగా, అతడి కుటుంబానికి రూ. 21500 చొప్పున నగదు సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మిత్ర బృందం సభ్యులు కొత్తపల్లి తిరుపతి, రాజు అశోక్, బర్ల శేఖర్‌యాదవ్ తదితరులున్నారు.

వాటర్‌కూలర్ అందజేత

కోరుట్ల రూరల్, జనవరి 20 : పట్టణంలోని ప్రభుత్వ దవాఖానకు కోరుట్ల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం వాటర్ కూలర్‌ను అందజేశారు. ఈ మేరకు లయన్స్‌క్లబ్ సభ్యుడు ఎంఏ రాహూఫ్ అందజేసిన వాటర్ కూలర్‌ను దవాఖానలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు కుందారపు మహేందర్, కార్యదర్శి శ్రీగద్దె నరేందర్, కోశాధికారి కొమ్ముల జలపతిరెడ్డి, లయన్స్ సభ్యులు గుంటుక చంద్రప్రకాశ్, అడెపు మధు, చాప కిశోర్, గుంటుక సురేశ్‌బాబు, జగన్, కొమ్ముల జీవన్‌రెడ్డి, గుణాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఫిట్‌నెస్ పత్రాల తనిఖీ

ఇబ్రహీంపట్నం, జనవరి 20 : ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాల బస్సుల ఫిట్‌నెస్ పత్రాలను ఎస్ఐ అనిల్ సోమవారం తనిఖీ చేశారు. మండలం నుంచి మెట్‌పల్లిలోని ప్రైవేట్ స్కూళ్లకు వెళ్తున్న బస్సులను పరిశీలించి, ఫిట్‌నెస్, డ్రైవింగ్ లైసెన్స్, సేఫ్టీ ఎక్యూప్‌మెంట్స్ పత్రాలను తనిఖీ చేశారు.

నేడు మున్సిపల్ సమావేశం

మెట్‌పల్లి, జనవరి 20: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మోహన్ సోమవారం తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ రాణవేని సుజాత అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందని, సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

కబడ్డీ క్రీడాకారిణికి అభినందనలు

మేడిపల్లి, జనవరి 20 : మేడిపల్లికి చెందిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ బలగం రాజేశ్, సునీత దంపతుల కూతురు బలగం సుష్మిత అంతర్జాతీయ కబడ్డీ అండర్-19 విభాగ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారు. కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపిన బలగం సుష్మితను ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ సోమవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బోంగోని రాజాగౌడ్, అంగడి ఆనంద్‌కుమార్, నాయకులు రావు శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

కప్పారావుపేట వాసికి డాక్టరేట్

వెల్గటూర్, జనవరి 20: కప్పారావు పేట గ్రామానికి చెందిన చెరుకుపల్లి రాజేశ్ వరంగల్ ఎన్ఐటీ నుంచి సివిల్ ఇంజినీరింగ్ విభాగంలోని స్ట్రక్చరల్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ పట్టా అందుకున్నాడు. ఆయన 'ఏ స్టడీ ఆన్ సేర్‌బీహేవియర్ ఆఫ్ హైయ్యర్ స్ట్రేంత్ కాన్‌క్రేట్'పై చేసిన పరిశోధనకు గాను పట్టా పొందాడు.

కార్యవర్గం ఎన్నిక

కొడిమ్యాల, జనవరి 20 : శ్రీరాములపల్లిలో సోమవారం అంబేద్కర్ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా దోమకొండ ఉదయ్‌కుమార్, గౌరవాధ్యక్షుడిగా బండపల్లి అంజన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా బండపల్లి తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా దోమకొండ జలెందర్, కార్యదర్శిగా బండపల్లి స్వామి, ఆర్గనైజింగ్ డైరెక్టర్‌గా బండపల్లి భూపతి, ఆర్గనైజేషన్ సహాయ కార్యదర్శిగా బండపల్లి ధర్మపురి, సంయుక్త కార్యదర్శిగా బండపల్లి సంతోష్, సలహాదారులుగా బండపల్లి లింగయ్య, శంకరయ్య ఎన్నికయ్యారు. ఒక సంవత్సరం పాటు కార్యవర్గం కొనసాగుతుందని సంఘ సభ్యులు తెలిపారు.

సౌదీలో కల్లివెల్లి అయి..

కొడుకుకు ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం స్వదేశానికి..

జగిత్యాల, జనవరి 20: ఉపాధి కోసం సౌదీకి వెళ్లిన అతను కళ్లివెల్లి కాగా.. కొడుకుకు బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం తిరిగి స్వదేశానికి చేరుకున్నాడు. పూర్తి వివరాలిలా ఉన్నాయి. జగిత్యాలకు చెందిన కుక్కల చిన్న భీమయ్య రెండేళ్ల కిందట సౌదీ వెళ్లగా, ఆరు నెలలు ఆజాద్ వీసా మీద పనిచేశాడు. తర్వాత కళ్లివెల్లి అయి పని దొరికిన రోజు చేసుకుంటూ జీవనం సాగించాడు. అతని కొడుకైన కుక్కల సునీల్ బోన్ మ్యారో వ్యాధితో బాధపడుతుండగా, ప్లేట్లెట్స్ ఎన్ని సార్లు ఎక్కించినా కౌంట్ పెరగ లేదు. తండ్రి వస్తే బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేస్తామని, వైద్యులు తెలుపడంతో కుటుంబ సభ్యులు భీమయ్యకు సమాచారం ఇచ్చారు. అయితే, అతను ఇంటికి రావడానికి సౌదీ ప్రభుత్వం జరిమానా వేసింది. ఈ విషయం తెలిసిన తెలంగాణ గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక రాష్ట్ర అధికార ప్రతినిధి గాజుల సంపత్ కుమార్ ఖర్చులు కోసం 3,600 రియాళ్ళు, టికెట్ ఖర్చులను సౌదీలోని తెలుగు వారి నుంచి సేకరించి భీమయ్యను స్వదేశానికి తీసుకువచ్చారు.

జిల్లాలో నేటి నుంచి గ్రామసభలు

జగిత్యాల, జనవరి 20 : ప్రభుత్వ ఆదేశాల మేరకు.. జిల్లాలో సంక్షేమ పథ కా ల లబ్ధిదారుల ఎంపికపై మంగళవారం 21 నుంచి 24 జనవరి 2025 వరకు జిల్లా లోని మండలాల్లో, మున్సిపల్ పరిధిలో వార్డుల్లో గ్రామసభలు నిర్వహిస్తామని కలెక్టర్ బీ సత్యప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధి దారుల జాబితాను ఎంపిక కోసం ప్రజల నుంచి ఎలాంటి అక్షేపణలు తీసు కొనుటకు జిల్లాలోని అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అగ్రికల్చర్ ఆఫీసర్స్, తహసీల్దార్, ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ డివిజన్ అధికారులు, మండల స్పెషల్ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రేపటి నుంచి నిర్వహించనున్న గ్రామసభలు నిర్వహించేందుకు తీసుకోవాల్సిన మార్గదర్శకాలను తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక విషయంలో ఎవరికైనా ఆక్షేపణలు ఉన్నా సంబంధిత పంచాయతీ కార్యదర్శి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, తహసీల్దార్, లేదా టోల్ ఫ్రీ నంబర్ 9666234383కు తెలుపాలన్నారు.

పెన్షనర్లకు ఆదాయపు పన్ను రద్దు చేయాలి

జగిత్యాల టౌన్, జనవరి 20 : కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లకు ఆదాయపు పన్ను రద్దు చేయాలని పాత పెన్షన్ పథకం పునరుద్ధరణ కోసం పీఎఫ్ఆర్‌డీఏ చట్టాన్ని రద్దు చేయాలని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 1న కొత్త ఆదాయపు పన్ను బిల్లుతో పాటు 2025-26 బడ్జెట్‌లో లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న దృష్ట్యా సోమవారం జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా, డివిజన్, మండల పెన్షనర్ల ప్రతినిధులు సమావేశమై ప్రధాని మోదీకి, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు పోస్టు కార్డులపై వినతులు రాశారు. ధరూర్ క్యాంపులోని పోస్టల్ డబ్బాలో పోస్టు కార్డులు వేశారు. ఈ కార్యక్రమంలో బొల్లం విజయ్, పీ హన్మంతరెడ్డి, గౌరిశెట్టి విశ్వనాథం, వెల్మల ప్రకాశ్‌రావు, ఎండీ యాకూబ్, పూసాల అశోక్‌రావు, బీ రాజేశ్వర్, పబ్బా శివానందం, గంగాధర్ పాల్గొన్నారు.

నూతన రేషన్‌కార్డుల సర్వే పరిశీలన

మల్యాల, జనవరి 20 : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రేషన్‌కార్డుల మంజూరు కోసం పంచాయతీ సిబ్బంది చేపడుతున్న ఇంటింటా సర్వేను జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటా వివరాలను ఏ విధంగా సేకరిస్తున్నారో పంచాయతీ ఈవో శ్రీకాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట తహసీల్దార్ మునీందర్, ఎంపీడీవో స్వాతి, ఎంపీవో ప్రవీన్, ఆర్ఐ రాణి, తిరుపతి, స్థానిక నాయకులు శనిగారపు తిరుపతి, వీరబత్తిని ప్రసాద్ తదితరులున్నారు.

భార్య మరణం తట్టుకోలేక ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం, జనవరి 20 : భార్య మరణం తట్టుకోలేక భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం మండలంలోని గోదూర్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ అనిల్ వివరాల ప్రకారం.. గోదూర్‌కు చెందిన రెబ్బాసి ఆశన్న(72) భార్య శాంత మూడు నెలల క్రితం మరణించింది. దీంతో కలత చెందిన ఆశన్న కొన్ని రోజుల కిందట ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి మంచంపై పడి ఉన్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించగా, పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. కొడుకు రెబ్బాసి రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

జగిత్యాల, జనవరి 20 : పంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, కార్మికులందరికీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డీపీవోకు సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 26 వరకు కార్మి కులకు 2 జతల యూనిపామ్స్, సబ్బులు, నూనెలు, ఇవ్వాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా పంచాయతీల్లో దీర్ఘకాలికంగా సేవలను అందిస్తూ, నిరంతరం పనులు చేస్తున్న పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు డీపీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ యూనియన్ జిల్లా నాయకులు రాజేశం, కనికరపు సత్తయ్య పాల్గొన్నారు.

ధర్మపురి అభివృద్ధికి కృషి

- విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జనవరి 20 : ధర్మపురి పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్నానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ధర్మపురి పట్టణంలోని పలువార్డుల్లో రూ.15కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు పెద్దపెల్లి ఎంపీ వంశీకృష్ణతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ.. అమృత్ స్కీమ్ ద్వారా ధర్మపురి ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామన్నారు. పదిరోజుల్లో ధర్మపురి ప్రభుత్వ దవాఖానలో ఐసీయూని ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ ధర్మపురి ఆలయ అభివృద్ధి కోసం ఎంపీ నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. గోదావరి వరద నీరు ఇళ్లలోకి రాకుండా కరకట్ట నిర్మాణం కోసం కేంద్రజలశక్తి శాఖ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఇక్కడ స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌నర్సన్ సంగి సత్తెమ్మ, కమిషనర్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ రామన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్యలక్ష్మణ్, వైస్ చైర్మన్ నర్సింహులు, తదితరులున్నారు.

మెస్ చార్జీలు చెల్లించాలి

జగిత్యాల, జనవరి 20 : మార్కెట్ ధరలకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి రూ.25 మెస్‌చార్జీలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వెన్న మహేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏఐటీయూసీ అనుబంధ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన వర్కర్లతో కలిసి జగిత్యాల ఎంఈవోకు వినతిపత్రం అందించారు. మార్కెట్ ధరలకనుగుణంగా మెనూ చార్జీలు లేనందున రెండు కూరలతో భోజనం పెట్టలేరని పేర్కొన్నారు. 9 నెలలుగా పెండింగ్‌లో ఉన్న కోడిగుడ్డు బిల్లులను వంట కార్మికులకు వెంటనే చెల్లించాలని కోరారు. ఇక్కడ కార్మికులు శారద, బీ లక్ష్మి, మల్లేశ్వరి, కె లక్ష్మి, జరినా, లత, రాధ, రజిత, జయశ్రీ, కవిత, లక్ష్మి పాల్గొన్నారు.

ఫిజీ ఐలాండ్ దేశంలో ఉద్యోగావకాశాలు

జగిత్యాల రూరల్, జనవరి 20 : తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) రాష్ట్ర ప్రభుత్వంలోని కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ద్వారా అర్హత, నైపుణ్యం గల స్కిల్డ్ కార్మికులకు అవకాశాలు కల్పిస్తున్నదని జిల్లా ఉపాధి కల్పన అధికారి సత్తెమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజీ ఐలాండ్ దేశంలో నిర్మాణ, ఐటీ ఫీల్డ్, అకౌంటెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, సంబంధిత విద్యార్హతలు, ఆంగ్లంలో నైపుణ్యం ఉండి, 25 నుంచి 35 ఏళ్ల వయసు మధ్య ఉన్నవారు అర్హులులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 24న ఉదయం 10:30 నుంచి 2 గంటల వరకు జిల్లా సమీకృత కలెక్టరేట్ కాంప్లెక్స్, ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం జగిత్యాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని, మరిన్ని వివరాల కోసం 9440049937, 7396760224 నంబర్లలో సంప్రదించాలన్నారు.

దాడులు చేయడం సరికాదు

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మల్యాల, జనవరి 20 : మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఇంటిపై కాంగ్రెస్ నాయకుల దాడి సరికాదని మల్యాల మండల బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. మల్యాలలో పార్టీ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్ స్థానిక నాయకులతో కలసి వారు విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వాన్ని విమర్శిస్తే తాము ఏనాడూ దాడులు చేయలేదని చెప్పారు. కానీ, కాంగ్రెస్ పాలనలో దాడులకు దిగుతున్నారని, ఇది ఏమాత్రం సరికాదని సూచించారు. ఇక్కడ సహకార సంఘ అధ్యక్షుడు బోయినిపల్లి మధుసూదన్‌రావు, నాయకులు సుభాన్, గడ్డం రాజేశం, అనిల్‌రెడ్డి, బద్దం తిరుపతిరెడ్డి, దుర్గయ్య, మల్లారెడ్డి, అజహరొద్దీన్, రాజమల్లయ్య, సంజీవ్, అమీర్ పాల్గొన్నారు.

కారుతో ఢీకొట్టి.. ఆపై దాడి చేసి..

మెట్‌పల్లి, జనవరి 20 : కారుతో ఢీకొట్టడమే కాకుండా.. గాయపడ్డ వ్యక్తిని దవాఖానకు తీసుకెళ్లాలని కోరిన మరో వ్యక్తిపై దాడికి దిగారు. మెట్‌పల్లి మండలంలోని వేంపేట రోడ్డులో ఈ నెల 18న జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 18న రాత్రి 7.30 గంటల సమయంలో మెట్‌పల్లి పట్టణంలోని గాజు లపేటకు చెందిన టైల్స్ కార్మికుడు బోయిని కార్తీక్ పనులు ముగించుకుని తన బైక్‌పై ఇంటికి తిరిగి వస్తూ వేంపేటలోని ఓ పెట్రోల్ బంక్ వద్ద ఆగాడు. ఈ క్రమం లో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో కిందపడిపోయిన కార్తీక్‌కు తీవ్ర గాయాలు కాగా, అదే సమయంలో అటువైపుగా వెళ్తున్న మల్లాపూర్ మండలం నడికుడ గ్రామానికి చెందిన నన్నపు రమణరాజు ఆగి కార్తీక్‌ను దవాఖానకు తీసుకెళ్లాలని కారులో ఉన్న వ్యక్తులకు సూచించాడు. దీంతో కారు డ్రైవర్, అందులో ఉన్న వ్యక్తులు రమణరాజును అసభ్యకరంగా దూషిస్తూ ఇటుక రాళ్లతో దాడి చేసి, ఫోన్‌ను ధ్వంసం చేశారు. రమణరాజు తలకు తీవ్రగాయ మైంది. సమాచారం అందుకున్న కార్తీక్ కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని గాయపడ్డ వారిని దవాఖానకు తరలించారు. కార్తీక్ భార్య నవ్య ఫిర్యాదు మేరకు ఘటనకు కారణమైన మల్లాపూర్ మండలం ఒబులాపూర్‌కు చెందిన నలుగురిపై సోమవారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

జగిత్యాల, జనవరి 20 : తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలను, ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ, అంబేద్కర్ యవజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ ఆవరణలో మాట్లాడారు. ఈ నెల 29న హైదరాబాద్ ఇందిరాపార్కులో నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల సభను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలు ఆవిష్కరించారు. టీపీఎస్ జేఏసీ, టీఎవైఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు బోనగిరి మల్లారెడ్డి, కొంగర పవన్, అధికార ప్రతినిధి దుమాల రాజ్‌కుమార్, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎలిశెట్టి గంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్జెల రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు షాహేద్ మహ్మద్ షేక్, జగిత్యాల పట్టణాధ్యక్షుడు ఎనుగంటి మోహన్, శేఖర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

కొడిమ్యాల/రాయికల్/కథలాపూర్, జనవరి 20 : రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎంపై దాడిని ఉపాధ్యాయులు ఖండించారు. అంబారిపేట జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పాఠశాలలోనే హెచ్‌ఎంపై దాడి చేయడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు కొలుగూరి కిషన్ రావు, ఉపాధ్యాయులు రాజేందర్, కృష్ణ, రాంరెడ్డి, గంగాధర్, మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు. రాయికల్ మండలంలోని మైతపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. హెచ్‌ఎం ముక్కాల మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు వేముల మధు, కలువకోట కార్తీక్, వేముగంటి గిరిధర్, రాపర్తి నర్సయ్య, సిద్దె గంగరాజం, కొండూరి రజనీకాంత్ పాల్గొన్నారు. కొడిమ్యాల మోడల్ స్కూల్ ఎదుట ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రణీత, రమణ, విజయ్, మహేందర్, భాగ్యలక్ష్మి, పద్మ, శిరీష, శరణ్య, ప్రమోద్ తదితరులున్నారు.